క్లుప్తంగా

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తి చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

మిర్యాలగూడ : మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎల్ఆర్ఎస్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఎంపీడీఓ, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ కోసం లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్లు, ఆర్ఐలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అడవిదేవులపల్లి : స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని సత్రశాల ఫీడర్ కొత్త బ్రేక్‌ను ఏర్పాటు చేసేందుకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీను తెలిపారు. శనివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడవిదేవులపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని అడవిదేవులపల్లి, ఉల్సాయిపాలెం, ముదిమాణిక్యం, గోనియాతండా, చాంప్లాతండా, వస్రాంతండా, జిలకరకుంటతండా, హాముతండా, తాటిచెట్టుతండా, వీర్లపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని రైతులు, విద్యుత్ వినియోగదారులు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

చెక్కు అందజేత

త్రిపురారం : నిడమనూరు మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన దారం నాగార్జున, తెలకపల్లి నాగమణిలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ సత్యం మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న వారిని ప్రభుత్వం సీఎం రిలీఫ్‌ఫండ్ పథకంతో ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలంపల్లి మైసయ్య, మేరెడ్డి వెంకట రమణ, శివ, లక్ష్మీ నారాయణ, రామలింగయ్య పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామంలోని హరిజనవాడ పాఠశాలలోని 31మంది పేద విద్యార్థులకు, స్థానిక జంగాల కాలనీలోని 20మంది పేదలకు ఆర్‌జీఏ చారిటబుల్ ట్రస్ట్ మిర్యాలగూడ బ్రాంచ్ మేనేజర్ కెతావత్ మున్సింగ్‌నాయక్ శనివారం ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దైద సాల్మన్‌రాజు, దైద రవీందర్, మున్నా నాయక్, సుజాత, ఆశా, దైద సోములు, నాగు నాయక్, హెచ్ఎం శ్రీనివాస్‌రెడి ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

దేవరకొండ : పట్టణంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. శనివారం పట్టణంలోని పలు కాలనీల్లో చేపట్టిన సభ్యత్వ నమోదులో ఆ పార్టీ నాయకులు పాల్గొని మాట్లాడారు. స్థానిక అయ్యప్పనగర్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. ఆయన వెంట జల్దా భాస్కర్, అవ్వారి శేఖర్, తదితరులున్నారు.

రసాయన వ్యర్థాలతో వెళ్తున్న లారీ పట్టివేత



పట్టుబడిన రసాయన వ్యర్థాల లారీ

పెద్దవూర : రసాయన వ్యర్థాలతో వెళ్తున్న లారీని శనివారం పెద్దవూర మండల కేంద్రంలో స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేట నుంచి రసాయన వ్యర్థాల లోడుతో బయల్దేరిన లారీ పెద్దవూర మండల కేంద్రం నుంచి మల్లేపల్లి వైపు వెళ్తోంది. లారీ నుంచి రసాయన వ్యర్థాలు చుక్కలు, చుక్కలుగా లీకవుతూ రోడ్డుపై పడి ఘాటైన వాసన వస్తుండడంతో పెద్దవూర మండల కేంద్రంలో స్థానికులు లారీని ఆపే ప్రయత్నం చేయగా లారీ డ్రైవర్ ఆపకుండా ముందుకు వెళ్లాడు. స్థానిక యువకులు లారీని అడ్డగించి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు లారీని పోలీస్ స్టేషన్ వద్దకు తరలించారు. రసాయన వ్యర్థాల తరలింపునకు సంబంధించిన పత్రాలను చూపించాల్సిందిగా డ్రైవర్‌ను పోలీసులు అడగగా తన వద్ద ఎలాంటి పత్రాలు లేవని డ్రైవర్ పేర్కొన్నట్లు స్థానిక యువకులు తెలిపారు. ఆంధ్రా ప్రాంతం నుంచి రసాయన వ్యర్థాలను తీసుకొచ్చి రాత్రివేళ జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారి వెంట పారబోసి వెళ్తున్నారని, చాలా ప్రదేశాలలో ఇలాంటి ఘాటైన రసాయన వ్యర్థాలను వదిలి వెళ్తుండటంతో ప్రజలు వాసనను పీల్చుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

- చిన్న చెరువు అలుగుపోయడంతో వరద ఉధృతికి కొట్టుకుపోయిన వంతెన
- ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు



కొట్టుకుపోయిన కల్వర్టు

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలోని చిన్న చెరువు(ఊర చెరువు) కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు అలుగుపోస్తుంది. దీంతో సమీపంలోని కల్వర్టు పూర్తిగా ధ్వంసమైంది. కల్వర్టు తెగిపోయి నెలలు గడుస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామం నుంచి షార్ట్‌కట్ రూటు కావడంతో సమీపంలోని దొండవారిగూడెం, పచ్చారుగడ్డ, ఆదర్శనగర్, కోడెబండ తండా ప్రజలు ఈ రోడ్డుగుండా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. తడకమళ్లలో ఎస్‌బీఐ బ్యాంకు ఉండటంతో సమీప గ్రామాల ప్రజలు నడిచివచ్చేందుకు వీలుగా ఉన్న ఈ మార్గం ద్వారా బ్యాంకుకు చేరుకుంటారు. కొద్ది రోజులుగా కల్వర్టు పూర్తిగా తెగిపోవడంతో తడకమళ్లతో పాటు ఆయా గ్రామాలకు లింకు తెగినట్లు అయింది. దీంతో వివిధ పనుల నిమిత్తం ఆ రోడ్డుగుండా ప్రజలు రాలేక ఇబ్బందులు పడుతున్నారు.

రైతులకూ ఇబ్బందులే..

తడకమళ్ల గ్రామానికి చెందిన రైతుల పొలాలు ఈ కల్వర్టు దాటిన తరువాత ఉండటంతో రైతులు తమ పొలాల వద్దకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎరువుల బస్తాలు తీసుకెళ్లాలన్నా ఎంతగానో శ్రమించాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. ప్రస్తుతం వరి పొట్టదశలో ఉందని వరికోతలు మొదలు పెడితే తమ ధాన్యం ఏ విధంగా తరలించాలో తెలియడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాధికారులు స్పందించి వరదలకు కొట్టుకపోయిన కల్వర్టును బాగుచేసి తమ ఇబ్బందులను తొలగించాలని రైతులు, ఆ రోడ్డు ప్రయాణించే వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలి



చిన్న చెరువు అలుగు పోయడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ విషయాన్ని గ్రామ పెద్దల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం వరికోతలు కోసే సమయం వచ్చింది. వరికోతలు చేస్తే దాన్యం ఏ విధంగా బయటకు వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. కల్వర్టు తెగిపోవడంతో కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి మా గ్రామానికి రావాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధ్వంసమైన కల్వర్టును పునరుద్ధరించి మా ఇబ్బందులను తొలగించాలి.

– బత్తుల సోమిరెడ్డి, రైతు

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

త్రిపురారం : అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకుసాగుతుందని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా మంజూరైన చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, వైస్ చైర్మన్ బుసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దనావత్ భాస్కర్ నాయక్, ఎంపీడీఓ విజయ కుమారి, తహసీల్దార్ ప్రమీలా, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య, పట్టణ అధ్యక్షుడు అనుముల వెంకట్ రెడ్డి, బిట్టు రవికుమార్, ధన్‌సింగ్ నాయక్, మహిళ అధ్యక్షురాలు పద్మ, సైదులు, శ్రీనివాస్, బాలకృష్ణ, వెంకట్రాం నాయక్, షేక్ హుస్సేన్, చారి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

అడవిదేవులపల్లి : అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం స్థానిక రైతు వేదికలో నిర్వహించిన ప్రజా సమస్యలు–ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మండల ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మండలంలో కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న దున్నపోతుల గండి లిఫ్ట్ పనులను త్వరితగతిన ప్రారంభించి అందుబాటులోకి తీసుకువస్తానన్నారు. పార్ట్-బీలో ఉన్న ప్రభుత్వ భూములను పూర్తి స్థాయి సర్వే నిర్వహించి కబ్జాదారులను గుర్తించి ప్రభుత్వ పట్టదారు పాస్ పుస్తకాలను అందిస్తామన్నారు. అధికారులు సమస్యలను పట్టించుకోకున్న, సమయ పాలన పాటించకుంటే స్వచ్ఛందంగా ఇక్కడి నుంచి వెళ్లిపోవచ్చని సూచించారు. సమర్థంతంగా పని చేస్తేనే మండలం అనిన విధాలుగా అభివృద్ధి జరుగుతుందన్నారు. అదే విధంగా రైతు వేదిక, మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలను నాటారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మహ్మద్‌బిన్ అహ్మద్, తహసీల్దార్ సురేష్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, రాష్ట్ర నేత స్కైలాబ్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్, మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు రమావత్ బాలునాయక్, సీఐ వీరబాబు, ఎస్ఐ శేఖర్, ఏవో సరితలతో పాటు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం అందిస్తాం

మిర్యాలగూడ : పట్టణంలో శాంతినగర్‌లో శుక్రవారం పిడుగుపాటుకు పలువురి ఇళ్లలో విద్యుత్ పరికరాలు కాలిపోగా ఒకరి ఇంటి రేకులు ధ్వంసమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శనివారం కాలనీకి చేరుకొని పలువురి ఇళ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. పిడుగుపాటుకు నష్టపోయిన బాధితులకు సత్వరమే పరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భవనాలు కుల సంఘాలకు అప్పగించాలని వినతి



డీఈ వెంకన్నకు వినతిపత్రం అందజేస్తున్న కుల సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలో నిర్మించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ భవనాలను కుల సంఘాలకు అప్పగించాలని కోరుతూ శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం మున్సిపల్ డీఈ వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఒక్కొక్క భవనానికి రూ. కోటిలతో నిర్మాణం చేపట్టి కుల సంఘాలకు అప్పగించకుండా నిరుపయోగంగా ఉంచారన్నారు. అయితే కొంత మంది ఈ మూడు బిల్డింగ్‌లలో గ్రంథాలయాలను నడిపించేందుకు చూస్తున్నారన్నారు. ఈ విషయంపై మున్సిపల్ డీఈ వెంకన్న మాట్లాడుతూ కాంట్రాక్టర్‌కు బిల్లు రాకపోవడంతో మున్సిపాలిటీకి అప్పగించలేదని, ఈ భవనాల్లో కొన్ని వసతులు కల్పించాల్సి ఉందని, ఆ వసతులు కల్పించిన తరువాత తిరిగి ఆయా కుల సంఘాలకు అప్పజెప్పనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం బీసీ సంఘాల సమావేశం ఉన్నందున వారికి ఒక్క రోజు సమావేశానికి భవనం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ రాష్ట్ర నేత వస్కుల మట్టయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు పోతుగంటి కాశీ, తిరుమలగిరి అంజి, గోపాల్ దాసు ఇమ్మానియేలు, దాసరాజు జయరాజు, జ్వాల వెంకటేశ్వర్లు, మురళియాదవ్, వస్కుల భరత్, వట్టిపు సుధీర్‌కుమార్, నాగేశ్వర్‌రావు, కిరణ్, వినయ్, శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

ప్రమోషన్‌పై వెళ్తున్న న్యాయమూర్తికి సత్కారం



న్యాయమూర్తిని సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న స్వర్ణలత సీనియర్ సివిల్ జడ్జిగా ప్రమోషన్‌పై వెళ్తుండటంతో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి. రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయమూర్తి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి జి. వేణు, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీఎస్ఎన్ సుమబాల, వేలాద్రి, ఏజీపీ శ్రీధర్ గౌడ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ అర్బన్ : ఈ నెల 21, 22, 23వ తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించే ఐద్వా రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను శనివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు వరలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే మహిళా బిల్లును ప్రవేశపెట్టాలని, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి. నాగమణి, ఐద్వా నాయకురాలు గోవర్ధని, అరుణ, ఊర్మిల, కౌసల్య, భాగ్యమ్మ పాల్గొన్నారు.

ముగిసిన మల్టీపర్పస్ వర్కర్ల శిక్షణ



వర్కర్లకు శిక్షణ పత్రాలు అందజేస్తున్న డీఈఈ మధు, ఏఈఈ ప్రదీప్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మిషన్ భగీరథ పథకంపై అవగాహన కల్పించేందుకు గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు నాలుగు రోజులు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ శిక్షణ తరగతులు మండలంలోని కొంపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేశారు. శనివారం డీఈఈ మధు శిక్షణ తరగతుల్లో పాల్గొని నిర్వాహణపై అవగాహన కల్పించి, శిక్షణ పూర్తిచేసుకున్న వారికి పత్రాలను అందజేశారు. నాలుగు రోజుల శిక్షణలో భాగంగా మోటార్ల రిపేరింగ్, పైపులైన్ల మరమ్మతులు, చేతిపంపుల రిపేరింగులు, తాగునీటి నాణ్యత తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈఈ మధు మాట్లాడుతూ ప్రతి ఇంటికి సురక్షితమైన మంచినీటిని అందించేందుకు పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి మంచినీటిని అందించే బాధ్యత మీదేనన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈఈ ప్రదీప్‌రెడ్డి, శిక్షకులు వీరారెడ్డి, ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల చదువుకు ఆటంకం కలిగించొద్దు



కొండమల్లేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నాగేశ్వర్‌రావు

మిర్యాలగూడ : పిల్లలు ఇంటి వద్ద చదువుకునే సమయంలో ఆటంకం కలిగించకుండా వారికి ప్రశాంతమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని బకల్‌వాడీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. బడిలో పిల్లల్లో వస్తున్న మానసిక, శారీరక మార్పులను గమనిస్తూ తల్లిదండ్రులు సరైన సూచనలు చేయాలన్నారు. పిల్లలు చదువుకునే సమయంలో టీవీలు పెట్టడంతో వారి చదువుకు భంగం కలిగే అవకాశం ఉందని, విద్యార్థులకు సెల్‌ఫోన్లు అలవాటు చేయొద్దన్నారు. ఈ సమావేశంలో దాశివ, మక్లానాయక్, జియావుద్దిన్, పద్మావతి, శ్రీనివాస్‌రెడ్డి, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం, ఎంఈఓ రమావత్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లెక్చరర్లను నియమించాలని ధర్నా



హాలియా జూనియర్ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హాలియా : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణిత, వృక్షశాస్త్రం సబ్జెక్టు బోధించే లెక్చరర్లను వెంటనే నియమించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. అంతకముందు ఆ సంఘం సాగర్ డివిజన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీశ్, కోరే రమేశ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదుల నెలలు గడస్తున్న లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థులకు ఆయా సబ్జెక్టులు బోధించడానికి లెక్చరర్లు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అనుముల మండల కార్యదర్శి ఆలేటి చందు, టౌన్ అధ్యక్షుడు వర్షిత్, వరప్రసాద్, గోపి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



పెద్దవూర : రికార్డులను పరిశీలిస్తున్న ఏటీడీఓ శ్రీనివాస్

పెద్దవూర : విద్యార్థులు పాఠశాల దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని జిల్లా సహాయ గిరిజన అభివృద్ధి అధికారి(ఏటీడీఓ) ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, ఎస్టీ రెగ్యులర్ హాస్టల్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వర్కర్లకు సంబంధించిన హాజరు పట్టికలు, రికార్డులను, వంటగది, భోజనాలను, మూత్రశాలలు, వసతి గృహ పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. విధిగా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో సిబ్బంది, విద్యార్థుల హాజర్‌ను ఫేస్ రికగ్నేషన్ ద్వారా నమోదు చేయాలన్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతిలో పది జీపీఏ సాధించిన విద్యార్థులకు గిరిజన సంక్షేమ శాఖ రూ.50వేల నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం ధీరావత్ బాలోజీ, వార్డెన్ కొల్లు బాలకృష్ణ, ఉపాధ్యాయులు కూస్‌రెడ్డి రాంరెడ్డి, కృష్ణ, ఎండీ.షబ్బీర్, సంధ్య, షాహీన్‌బేగం, రామయ్య, ఏఎన్ఎం జ్యోతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మిర్యాలగూడ అర్బన్ : రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడిన సంఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తిప్పర్తి మండలం కంకణాలపల్లి గ్రామానికి చెందిన వెంకన్న 20ఏళ్ల క్రితం పట్టణానికి కుటుంబ సభ్యులను వదిలి కూలి పనులు చేసుకుంటూ రోడ్లపై జీవనం సాగి స్తున్నాడు. శనివారం సాయంత్రం రాజీవ్ చౌక్ వద్ద నిలబడి ఉండగా సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మిర్యాలగూడ నుంచి సూర్యాపేట వెళ్తున్న క్రమంలో అతడిపై నుంచి వెళ్లింది. దీంతో అతడికి ఎడమ కాలు నుజ్జు నుజ్జు అయింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

జాలి చూపని ఆటోవాలా

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన వెంకన్నను స్థానికులు హుటాహుటీన ఆస్పత్రికి తరలించేందుకు అందుబాటులో ఉన్న లోకల్ ఆటోను పిలువగా ఏ ఒక్కరూ కూడా స్పందించకపోవడం విస్మయానికి గురి చేసింది. తీవ్ర గాయాలతో బాధితుడు అలమటించిపోయాడు. పోలీసులు వచ్చినతరువాతే ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

మిర్యాలగూడ : ఖరీఫ్ సీజన్‌కు రైతు భరోసా లేనట్లేనని ప్రకటించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ ధర్నా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

హాలియా : రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతు భరోసాను ఎగవేతకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నిరసనగా ఆదివారం అన్ని మండల కేంద్రాల్లో చేపట్టే నిరసనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వ తీరుకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం చేయాలని కోరారు.

దాతల సహకారం అభినందనీయం



పెద్దవూర : బట్టుగూడెంలో విద్యార్థులకు టై, బెల్టులను పంపిణీ చేస్తున్న ఎంఈఓ తరి రాములు



హాలియా : పంగవానికుంట విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ కృష్ణమూర్తి

పెద్దవూర : నిరుపేద విద్యార్థులు చదువుకునే మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. శనివారం మండలంలోని బట్టుగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గడ్డంపల్లి రవీందర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా అందించిన టై, బెల్టుల, ఐడీ కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం లక్ష్మీప్రభ తన సొంత ఖర్చులతో టై, బెల్టులు, ఐడీ కార్డులను, బెంచీలను, బట్టుగూడెం పాఠశాలకు జీఆర్ఆర్ ఫౌండేషన్ 10బెంచీలు అందిస్తామని హామీ ఇచ్చినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాలి సైదిరెడ్డి, వెంకటేశ్వర్లు, చారి పాల్గొన్నారు.

హాలియా : మండలంలోని పంగవానికుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అహ్మద్ దాతృత్వంతో ఉచితంగా సమకూర్చిన ప్లేట్లు, గ్లాసులను శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల ఎంఈఓ గుండా కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు పాఠశాల హెచ్ఎం సయ్యద్ అహ్మద్ చేసిన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ యాదమ్మ, ఉపాధ్యాయురాలు శిరీష, సీఆర్పీ గోవింద్ పాల్గొన్నారు.

రేపు సీఎం ఇంటి ముట్టడి

మిర్యాలగూడ టౌన్ : లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న సీఎం ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ధీరావత్ కోట్యానాయక్ అన్నారు. శనివారం ఎన్ఎస్‌పీ క్యాంపులో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోర్ బోలి భాషను గుర్తించాలని, గ్రామ పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడంతో పాటు ఒక వైపు లంబాడీలకు మంత్రి పదవి, మరో వైపు గిరిజన హక్కుల కోసం నిర్వహించే ఈ ముట్టడిని విజయవంతం చేసేందుకు లంబాడీలు, విద్యార్థి, యువజన, మహిళలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు మస్తాన్‌నాయక్, రవీందర్‌నాయక్, రాజునాయక్, బాలాజీనాయక్, పాండునాయక్ పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని గడ్డిమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఆ విద్యార్థిని దసరా సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి శుక్రవారం మధ్నాహ్నం పాఠశాలకు చేరుకుంది. రాత్రి సమయంలో కళ్లు తిరుగుతున్నాయని తోటి విద్యార్థులకు తెలిపింది. దీంతో ఆ విద్యార్థినులు టీచర్ దృష్టికి తీసుకెళ్లారు. హాస్టల్‌లోని సిస్టర్‌కు చూపించగా ఏమైంది అని అడగటంతో ఇంటి వద్ద నుంచి వచ్చేటప్పుడే గడ్డిమందు తాగి వచ్చినట్లు చెప్పింది. దీంతో స్థానిక ఏరియా ఆస్పతికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స కోసం నల్లగొండకు తరలించాలని వైద్యులు సూచించడంతో కుటుంబ సభ్యులు నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. కాగా పాఠశాల ప్రిన్సిపల్ స్థానిక టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లకు సన్మానం



హాలియా : చైర్మన్, డైరెక్టర్లను సన్మానిస్తున్న సాయిమందిరం కమిటీ సభ్యులు

హాలియా : హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు వీరమల్ల శ్రీనివాస్, చిట్టిపోలు యశ్వంత్‌లను పట్టణంలోని సాయి మందిరం కమిటీ సభ్యులు శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాయి మందిరం కమిటీ అధ్యక్షుడు శేఖర్, మిల్లర్స్ గౌరవాధ్యక్షుడు యాదగిరి, శ్రీనివాస్, వెంకన్న, సంతోష్, ప్రభాకర్, సురేష్, అరవింద్, వెంకన్న పాల్గొన్నారు.



పెద్దవూర : చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

పెద్దవూర: హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన మండలంలోని చలకుర్తి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డిని శనివారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డిని శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ లింగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

హాలియా : ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్ దుకాణదారులు ప్రభుత్వ నింబంధనలు పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఏడీఏ రవీందర్, ఏఓ సరిత హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో మందులు, ఎరువులు నిల్వలు, బిల్లులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల దుకాణ యజమానులు ప్రభుత్వ నిబంధనలను పాటించి, రైతులకు అందించే విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలన్నారు. ఎరువులను ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, డీలర్‌షిప్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు.

వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలి

దేవరకొండ : గీత పనివారల సంఘం 67వ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కుంభం జయరాములు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృత్తి రక్షణ, ఆధునీకరణ, ఉపాధి గ్యారంటీ లక్ష్యంగా గీత వృత్తిదారులు ఉద్యమించాలన్నారు. ఈ సమావేశంలో పులయ్య, గోవర్ధన్, మహేష్, రాములు, యాదయ్య పాల్గొన్నారు.